## క్లుప్తంగా

### ముఖ్యమంత్రిని కలసిన మంత్రి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

**కళ్యాణదుర్గం:** చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కలిశారు. సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో బీటీపీకి భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాలని కోరారు. పరిహారం అందించిన వెంటనే ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చొరవ చూపాలన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంత్రి 'సాక్షి'కి తెలిపారు.

### తాగునీటి సమస్య పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని 17, 18వ వార్డు పరిధిలో వచ్చే అజాద్ స్కూల్ వద్ద ఎట్టకేలకు కలుషిత నీటి సమస్య పరిష్కారమైంది. కుబా మసీదు రోడ్డు వద్ద నుంచి అజాద్ స్కూల్ వరకూ కలుషిత నీరు సరఫరా అయ్యేది. కాలనీవాసుల వినతి, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, పాలకులు సకాలంలో స్పందించి యుద్ధ ప్రాతిపదికన దాదాపు 50 మీటర్ల మేర పైప్‌లైన్ మార్చేందుకు చర్యలు చేపట్టారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పూర్తవడంతో సోమవారం తవ్విన గుంతలను జేసీబీతో మూయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కాలనీవాసులు ఎస్ఎంజీ ఘని, రామ్మూర్తి, మస్తాన్, సాధిక్ తదితరులు నీటి సమస్య తీర్చినందుకు చైర్‌పర్సన్‌తోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్‌లు బషీర్ అహ్మద్, పొరాళ్ల శివకుమార్, కృష్ణమూర్తి, ఫిట్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో సత్తా



మెడల్స్ సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ, ఐఈఆర్టీలు

**కూడేరు:** అనంతపురంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్ జరుగుతోంది. అందులో కూడేరు హైస్కూల్‌కు చెందిన 10 మంది, కేజీబీవీలో ఒకరు, ఎస్సీ కాలనీలో ఉన్న ప్రైమరీ స్కూల్ నుంచి ఒకరు చొప్పున విద్యార్థులు పాల్గొన్నారు. 25, 50,100 మీటర్ల రన్నింగ్‌లో , 25 మీటర్ల స్లో వాక్ లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. సోమవారం ఆ విద్యార్థులకు కూడేరు హైస్కూల్ హెచ్ఎం శ్రీదేవి, ఐఈఆర్టీలు మస్తాన్ వలి, లక్ష్మీనారాయణ, పీఈటీ, విద్యార్థులు అభినందించారు.

### 'స్పందన'కు వినతుల వెల్లువ



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న తహసీల్దార్ శేషారెడ్డి

**కూడేరు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మండలవాసుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. సీపీఐ నేతలు గోపాల్, మనోహర్ వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరారు. అలాగే అంతరంగలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలని, ఉదిరిపికొండలో భూ వివరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని,రస్తా వివాదాన్ని పరిష్కరించాలని, గొటుకూరులో భూసమస్యలు పరిష్కరించాలని ప్రజలు వచ్చి విన్నవించుకున్నారు. తహసీల్దార్ శేషారెడ్డి వాటిని స్వీకరించి విచారణ జరిపి న్యాయం చేస్తామని దరఖాస్తుదారుకు హామీ ఇచ్చారు. కాగా కార్యక్రమానికి తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ మాత్రమే హాజరయ్యారు, మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరయ్యారు.

# సంక్షేమ ప్రదాత సీఎం జగన్

- 'గడప గడప'లో విప్ కాపు రామచంద్రారెడ్డి
- మాల్యంలో సచివాలయ ప్రారంభం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

**కణేకల్లు:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలందించడమే సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరోమారు జగనన్నను సీఎం చేసుకోవాలన్నారు. మండలంలోని మాల్యం గ్రామంలో సోమవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పారెడ్డి, మద్రేగౌడ్, హంపన్నగౌడ్, ఖాదర్‌తో కలిసి విప్ ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాలు ఇలాగే కొనసాగి పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే జగనన్నకు తోడుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలందిస్తుండంతో చంద్రబాబుతోపాటు టీడీపీ నాయకులకు కడుపులో మంటపడుతోందన్నారు. పేదలకు మంచి చేస్తే వారు ఓర్వలేకపోతున్నారన్నారు.

**ఆల్ ఫ్రీ బాబును నమ్మొద్దు**

అధికారం కోసం ఆచరణసాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేయడం అలవాటు పడిన బాబు మరోమారు మిమ్మల్ని మోసం చేయడానికి ఆల్ ఫ్రీ... మరో ఒక్క ఛాన్స్ ఇవ్వండని మీముందుకొస్తాడని.. ఎవ్వరూ నమ్మొద్దని విప్ కాపు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మారెంపల్లి మారెన్న, కెనిగుంట రామిరెడ్డి, ఇమాం వలీ, పి.బాషా, సుధాకర్, సిద్దేశ్వర, వేమన, సర్పస్, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, గెనిగెర గోపాల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన**

సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు పరిపాలన తీసుకొచ్చారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మాల్యం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం విప్ ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల ముంగిటకే సేవలందించాలనే ఉద్దేశ్యంతో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేసి సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకే సేవలపై పీఎం మోదీతోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా ప్రసంశిస్తున్నారన్నారు. ఏ సమస్య ఉన్నా మండల హెడ్‌క్వార్టర్, రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాల్సిన వసరం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఆర్ డీఈఈ రామ్మోహన్‌రెడ్డి, జేఈ జగదీష్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### మాది చేతల ప్రభుత్వం: విప్



**రాయదుర్గం:** టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసుల్లాగా మాటలు చెప్పి మభ్యపెట్టడం తమ నైజం కాదని, ఏపనైన సరే చేతల్లో చేసి చూపించడమే వైఎస్సార్‌సీపీ సిద్ధాంతమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని విప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన నాలుగేళ్ల మా ప్రభుత్వ హయాంలో పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడ్డామన్నారు. టీడీపీ హయాంలో మంత్రిగా ఉంటూ అభివృద్ధి ముసుగులో కాలవ రూ. వందల కోట్లు దోచేశాడని విరుచుకుపడ్డారు. కంత్రీ వ్యవహారాలకే పెద్దపీట వేస్తూ వచ్చాడన్నారు. ఈ విషయం తన మానసపుత్రికగా చెప్పుకునే 'ఈనాడు' లోనే మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా అంటూ అవినీతి బాగోతంపై వచ్చిన కథనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత టీడీపీ హయాంలో ఐదేళ్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్, మంత్రిగా పదవులు అనుభవించినా కాలవ రాయదుర్గం ప్రాంతాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేక పోయాడన్నారు. ఆరోజు చేతకాక మళ్లీ ఈరోజు చేస్తానంటూ ఇంకిత జ్ఞానం లేకుండ మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కల్లుతాగిన కోతిలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గడిచిన రెండు రోజుల క్రితం డి హీరేహాళ్ మండలం మలపనగుడి లో సచివాలయం, వెల్‌నెస్‌సెంటర్, ఆర్‌బీకే భవనాలు ప్రారంభించామన్నారు. ఈ రోజు కణేకల్లు మండలం మాల్యం లో రూ.43 లక్షల వ్యయంతో సచివాలయం ప్రారంభించామన్నారు. ఇలా రోజు ఏదో ఓ చోట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నా, కాలవ మాత్రం అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. తన హాయంలో అరకొరగా చేసిన పనులకు వారానికి ఒక సెల్ఫీతో సెల్ఫుడబ్బా కొడుతున్నాడన్నారు. త్వరలో తాము చేసిన అభివృద్ధిపై రోజూ ఒక సెల్ఫీ విడుదల చేస్తామని, అప్పుడు కాలవ తల ఎక్కడ పెట్టుకుంటాడో చూస్తామన్నారు. ఆయనకు తిక్క పూర్తిగా కుదరాలంటే 2024 ఎన్నికల్లో ఘోరంగా ఓడించి శాశ్వతంగా ఇంటికే పరిమితం చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు అలాగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు రైతు ద్రోహి అని విప్ కాపు విరుచుపడ్డారు. పెంచిన విద్యుత్‌చార్జీలు తగ్గించాలని అప్పటి ఉమ్మడి రాష్ట్రం హైదరాబాద్ బషీర్‌బాగ్ లో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన రైతన్నలపై తుపాకులు ఎక్కుపెట్టిన రాక్షసత్వం బాబుదని మండిపడ్డారు. అన్నదాతల సంక్షేమానికి ఒక్క వైఎస్ కుటుంబం మాత్రమే పాటుపడుతోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### వలంటీర్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

**రాయదుర్గం రూరల్:** మండలంలోని వేపరాల, కాశీపురం, ఆవులదట్ల, మల్లాపురం గ్రామాల్లో ఒక్కటి చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణపత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

### లలితకుమారి సేవలు చిరస్మరణీయం

**కళ్యాణదుర్గం:** ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు దివంగత చల్లా లలిత కుమారి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 21వ వర్ధంతి సందర్భంగా సోమవారం సీఅండ్‌ఐజీఎం చర్చిలో కార్యక్రమం నిర్వహించారు. అలగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, చీరలు, వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాయల్ వెంకటేశులు, చల్లా విద్యుల్లత, చల్లా రాజశేఖర్ చౌదరి, విశ్రాంత డీఎంహెచ్‌ఓ చింతన్న, డాక్టర్ రాయలు, చల్లా కిశోర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

**కంబదూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తిమ్మరాజమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

## రక్తదానంతో ప్రాణదాతలు కావాలి



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కాపు భారతి

**రాయదుర్గంటౌన్:** అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి యువత ప్రాణదాతలు కావాల్సిన ఆవశ్యకత ఉందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కాపు భారతి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని జేఆర్ఎస్ కాలనీలోని భారత్ ఐటీఐ కళాశాలలోని వంద మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోట్ పుస్తకాలు, ఒక పెన్ను కాపు భారతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సాంకేతిక విద్యతో అద్భుతాలు సృష్టించవచ్చని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి దేశ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా ఎదగాలని ఆకాంక్షించారు. అపోహలు వీడి ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, ప్రిన్సిపాల్ మెహమూబ్‌బాషా, కౌన్సిలర్లు గోవిందరాజులు, డిష్ గోవిందు, బండి అజయ్, పెద్ద వన్నూరుస్వామి, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు అరవ శివప్ప, బషీర్ అహ్మద్, గంగాధర్, పవన్‌కుమార్, కొలిమి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు



జేసీబీతో ముళ్ల పొదలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు,వైఎస్సార్‌సీపీ నాయకులు

**విడపనకల్లు:** మండల కేంద్రంలో ఈ నెల 19వ తేదీన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి చేపట్టిన గడప గడపక మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు తక్షణ పరిష్కారం చేసే దిశగా కార్యచరణ ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్సీ కాలనీ ప్రజలకు ఇళ్లు, స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన ఎస్సీ కాలనీకి పక్కనే ఉన్న నాలుగు ఎకరాల్లో ఇళ్ల స్థలాలు లేని ఎస్సీలకు స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.దీంతో సోమవారం ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీంరెడ్డి, దేశాయ్ సిద్ధార్థ, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, విద్యా కమిటి చైర్మన్ గిరిబాబు తదితరులు తహసీల్దారు ఈరమ్మతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఖాళీ స్థలంలో పెరిగిన ముళ్ల పొదలను తొలగించి చదును చేయించారు. త్వరలోనే ఇల్లు లేని అర్హులైన నిరుపేద ఎస్సీలందరికీ స్థలాలు మంజూరు చేస్తామని తహసీల్దారు, ఎంపీపీ, జెడ్పీటీసీ భరోసా ఇచ్చారు. దీంతో ఎస్సీ కాలనీ ప్రజలంతా మాజీ ఎమ్మెల్యే.వై. విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ఓబుళమ్మ, కోఆప్షన్ సభ్యులు లతీఫ్, నాయకులు సత్తి, ఉలిగన్న, యువరాజు, సచివాలయ కన్వీనర్ నాగరాజు, శివశంకర్, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణలో జంబుకేశ్వరుడు



అలంకరణలో జంబుకేశ్వరుడు

**రాయదుర్గంటౌన్:** శ్రావణమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామికి విశేష అలకరణలో పూజలు నిర్వహించారు. రంగు రంగుల చామంతి పూలతోపాటు గులాబి, మల్లెపూలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు స్వామికి విశేష పూజలు, పంచామృతాభిషేకం, కుంకుమ అర్చన, మంగళనైవేద్యాలు చేపట్టారు.

**కంబదూరు:** మండల కేంద్రంలోని పురాతన ఆలయం మల్లేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, షిర్డీసాయి బాబా, కన్యాకపరమేశ్వరి ఆలయాల్లో శ్రావణ మాసం రెండో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

### ఆర్థికసాయం అందజేత

**కళ్యాణదుర్గం రూరల్:** మండలంలోని మల్లిపల్లికి చెందిన సుధాకర్ కొద్ది రోజుల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆత్మకూరు మండలం గొరిదిండ్ల గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు శశికళ సోమవారం సుధాకర్ భార్య గంగమ్మకు రూ.5,000, మూడు నెలలకు సరిపడా సరుకులు అందజేశారు.

### పీడీఎస్‌యూ పోస్టర్ల విడుదల

**రాయదుర్గంటౌన్:** సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు విద్యార్థులు తరలివచ్చి జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజు, ప్రవీణ్, హనుమేష్, సురేష్, సుధీర్ పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

**కళ్యాణదుర్గం రూరల్:** సత్యసాయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా కార్మికులకు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేస్వామి, హనుమంతరాయుడు, వన్నూరప్ప, అజయ్, తుల్లా, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పంట కోత ప్రయోగాలపై అవగాహన

**శెట్టూరు:** పంట కోత ప్రయోగాలపై ఆర్బీకే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట కోత ప్రయోగాలను ఎలా నిర్వహించాలి వాటి విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వ్యవసాయ అధికారిణి సంధ్యాకుమారి, ఏఎస్ఓ ఆదినారాయణరెడ్డి వివరించారు. ఈ క్రాప్ నమోదును సకాలంలో పూర్తిచేయాలని, ఈ క్రాప్ నమోదు వల్ల పొందే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు, ఆర్బీకే సిబ్బంది వీరాంజనేయులు, కుమారుస్వామి, ఆమని, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సమస్యలు పరిష్కరించాలి

**రాయదుర్గంటౌన్:** విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, అధ్యక్షుడు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంగ్రామ సైకిల్ యాత్ర సోమవారం రాయదుర్గానికి చేరుకుంది. ఈసందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 23న తాడిపత్రిలో ప్రారంభించిన సైకిల్ యాత్ర 30న అనంతపురంలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో హరి, లోకేష్, వీరేష్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## గాలి గోపురాల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

**కూడేరు:** మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం ఉత్తరం–దక్షిణం వైపు గాలి గోపురాల నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భూమి పూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బళ్లారికి చెందిన బసన్న గౌడ్ అనే భక్తుడు సుమారు రూ.90 లక్షలతో గాలి గోపురాలను నిర్మించేందుకు ముందుకు వచ్చాడు. కొన్నేళ్లుగా జోడులింగాలను కొలుస్తున్నాని, తన మొక్కు తీరడంతో గాలి గోపురాలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. ఆలయ అభివృద్ధికి బసన్నగౌడ్ సహకారమందించడం అభినందనీయమన్నారు. ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడానికి దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. తర్వాత జోడు లింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్వని,సర్పంచులు లలితమ్మ, రామాంజనేయులు, వైస్ ఎంపీపీ దేవ, ఈఓ బాబు, జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఓబుళప్ప, కోకా బాబు, చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు రామచంద్రారెడ్డి, రామాంజనేయులు, ఎర్రనాగప్ప, మంజునాథ్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## 'గోరుముద్ద'తో సంపూర్ణ ఆరోగ్యం

- మధ్యాహ్న భోజనంలో సమూల మార్పులకు సీఎం జగన్ శ్రీకారం
- రాగి జావ, చిక్కీలు, పోషకాహారం అందజేత



హీరేహాళ్ మండలం సిద్దాపురం పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

**రాయదుర్గం:** విద్యార్థుల ఆకలి బాధలు తీర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. గోరుముద్ద పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చి రోజుకో మోనూ తో నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా కృషి చేస్తున్నారు. దీనికి తోడు అదనంగా ఐరన్, కాల్షియం లాంటి పోషకాలు కలిగిన 'రాగి' జావను అందిస్తు వారి ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడుతున్నారు. వారికి మూడు రోజులు (మంగళ, గురు, శని) బెల్లంతో కూడిన రాగిజావను మోనూ జాబితాలో చేర్చారు. ఇక మిగిలిన మూడు రోజులు బలవర్ధకమైన చిక్కీలు అందిస్తూ సంపూర్ణ పోషకాహారం అందేలా కృషి చేస్తున్నారు. జగనన్న గోరుముద్దలో వారానికి 15 వెరైటీలు ఉండగా, ఐదు రోజుల పాటు కోడిగుడ్లు, మూడు రోజులు చిక్కీలు అందిస్తున్నారు.


**అభిరుచులకు అణుగుణంగా**

జగనన్న గోరుముద్ద పథకం తో అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులు నిత్యం నాణ్యమైన పౌష్టికాహారం స్వీకరిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తున్నారు. రక్తహీనత నుండి గట్టెక్కుతున్నారు. రాయదుర్గం నియోజవర్గంలోని ఐదు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, గురుకులాలు, ఉన్నత పాఠశాలలు కలుపుకుని 285 ఉన్నాయి. వీటిలో 1,848 మంది ఉపాధ్యాయులు ఉండగా, 50,773 మంది విద్యార్థులు బడులకు వెళుతున్నారు. అందరికీ గోరుముద్ద అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్కూల్ కమిటీలు పర్యవేక్షణ చూస్తూ గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చూస్తున్నారు.

**టీడీపీ హయాంలో నాసిరకం తిండి**

టీడీపీ హయాంలో నాసిరం ఆహారం, ఉడికీ ఉడకని అన్నం, రుచిపచీలేని కూరలతో మధ్యాహ్న భోజన పథకాన్ని నీరుగార్చారు. పిల్లలకు ఏమాత్రం రుచించని విధంగా రోజూ సాంబరు అన్నంతో కూడిన ఒకే రకమైన భోజనం తినలేక అవస్థలు పడేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులను పూర్తిగా మార్చేలా సీఎం జగన్ కృషి చేస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా గోరుముద్ద పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

**భోజనం చాలా రుచిగా ఉంటోంది**



పాఠశాలలో అందించే మధ్యాహ్న పథకం భోజనం చాలా రుచిగా ఉంటోంది. రోజూ ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుటున్నాం. వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, రోజుకో రకం భోజనం వడ్డిస్తారు. ఇష్టంగా భుజిస్తాం.

– మీనాక్షి, 10వ తరగతి, సిద్దాపురం

## 'ఆడుదాం ఆంధ్ర' విజయవంతం చేయాలి



బొమ్మనహాళ్: మాట్లాడుతున్న ఎంపీడీఓ షకీలాబేగం



కూడేరు: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంకే బాషా

**బొమ్మనహాళ్:** యువతను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ షకీలాబేగం, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, సీఆర్‌పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఆయా గ్రామ సచివాలయాల్లో 15 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఆటల పోటీల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఈరన్న, మల్లికార్జున, ఈఓపీఆర్‌డీ విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**కూడేరు:** ఆడుదాం ఆంధ్ర పేరిట ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకూ పలు పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంకే బాషా, ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ తన చాంబర్‌లో ఎంఈఓతో కలిసి ఆడుదాం ఆంధ్ర టోర్నీపై పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో సమీక్ష నిర్వహించారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 1 నుంచి వారి పరిధిలో ఉన్న సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మఘట్ట:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతంపై సోమవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాలు పైబడిన వారు క్రీడాపోటీలకు అర్హులన్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ బ్రహ్మయ్య , పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.